UNIVERSAL
LIBRARY
OU_206263
UNIVERSAL
LIBRARY

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T294.51/S77V Accession No. T1531

Author శ్రీనివాసరావు

Title విజ్ఞానచరిత్ర బ్రహ్మయోగము

This book should be returned on or before the date last marked below.

శ్రీ

# విజ్ఞానతారకబ్రహ్మయోగము.

ఇది

బళ్ళారిలో వకీలుగానుండి

కీ. శే. బ్రహ్మశ్రీ॥ కోలాచలం శ్రీనివాసరావుగారిచే

రచియింపఁబడినది.

వారి జ్యేష్ఠపుత్రులగు కె. శత్రుఘ్నరావుచేఁ

ప్రకటింపఁబడియెను.

ముద్రణహక్కు.

బళ్ళారి.

ఆంధ్రముద్రాక్షరశాలయందు

ముద్రితము.

1926.

Registered Copy--Right.

వెల అ. 0—8—0

# విజ్ఞానతారకబ్రహ్మయోగము.

సభ్యులారా!

కర్మసన్న్యాసరూపసాధనముగఁ బరిణమించినట్టియు, "త్వం" పదార్థ విమర్శనాపూర్వకమయినట్టియు, ప్రథమ షట్కము నాఱవయధ్యాయముతో ముగింపఁబడెను. ప్రథమషట్కమునందు కర్మయును గర్మసన్న్యాసమునుఁ దెలుపుచుఁ గర్మము చిత్తశుద్ధికిఁగా నాచరింపవలెననియు కర్మసన్న్యాసము జ్ఞానయోగసిద్ధికిఁ గారణంబగుననియు ప్రతిపాదించుచు బ్రహ్మవిదుఁడు గాఁదగినవాఁడు సదా బ్రహ్మనిష్ఠతోనే యుండవలయునని పలుకంబడినది. అనఁగాఁ బ్రథమషట్కము నజ్ఞేయంబగు త్వం పద లక్ష్యార్థము యోగసహితముగా వివరింపఁబడినది. ఇపుడీమధ్యమషట్కమున ధ్యేయ బ్రహ్మ ప్రతిపాదనమనఁగాఁ బరబ్రహ్మమనియెడు పరమపురుష స్వరూపంబును భక్తిశబ్దవాచ్యమగు తదుపాసనంబును జెప్పఁబడుచున్నది. కావున నిది "భక్తికాండమని" పిలువఁబడుచున్నది. స్మర్యమాణ విషయంబగు పరబ్రహ్మమత్యంత ప్రియతమంబగు విషయమగును కావున నది భక్తియని పిలువఁబడును. "స్నేహపూర్వమనుధ్యానం భక్తిరిత్యభిధీయతే" యనియున్నది కావున స్నేహపూర్వకమగు పరమాత్మానుధ్యానము భక్తియనంబడును. ఈ భక్తికాండమున ధ్యేయబ్రహ్మమగు "తత్పదార్థ" లక్షణము దెలుపఁబడును. పూర్వకాండాంత్య బీజశ్లోకమగు "యోగినామపి సర్వేషాం మద్గతే నాన్తరాత్మనా। శ్రద్ధావాన్భజతే యోమాం, సమేయుక్తతమోమతః॥" అను శ్లోకమున సదా బ్రహ్మనిష్ఠతోనుండవలెనని చెప్పఁబడినది. ఆ బ్రహ్మంబెట్టిది? ఎట్టిలక్షణముగలది? ఎట్లు దానియందుండవలెను? ఈ విషయము నిరూపించుటకునై సప్తమాధ్యాయము ప్రారంభింపఁబడినది. కొన్నిశ్లోకములందు వ్రాయఁదగిన యంశములు విశేషముగ లేనిచో వానితాత్పర్యముమాత్రము వ్రాయఁబూనెద. భగవంతుఁడు తన్ను లక్ష్యార్థమున నెఱుఁగు విధము నర్జునునకుఁ దెలిపెదనని ప్రారంభశ్లోకమునఁ దెలుపును.

1. అర్జునా! నానావిధ విభూతులుగల పరబ్రహ్మరూపమగు నాయందు సర్వదా లగ్నమగు శుద్ధమానసముగల నీవు నేనేశరణమనియెంచి సర్వసంశయములుమాని మనస్సమాధానమంది విభూతి బలశక్త్యైశ్వర్యాదులతోఁ గూడిన నన్ను నీవేవిధమున నెఱుఁగఁగలవో దానినిఁ దెలిపెద వినుము.

2. " జ్ఞానంతేహం సవిజ్ఞానమిదంవక్ష్యామ్యశేషతః ।
" యద్‌జ్ఞాత్వానేహ భూయోన్యత్ జ్ఞాతవ్యమవశిష్యతే ॥

ఏది తెలిసినయెడల నీలోకములో మఱియొకటి తెలిసికొనవలసినది లేదో యట్టి యనుభవజ్ఞానముతోఁ గూడిన శాస్త్రజన్యజ్ఞాన మంతయును నేను నీకుఁ జెప్పెదను.

పై శ్లోకమునందు జ్ఞానమనియు విజ్ఞానమనియు రెండుశబ్దము లుపయుక్తములైనవి. వానియర్థ మీరీతిగ, నిరూపింపఁబడినవి. జ్ఞానమనఁగా శాస్త్రజన్యజ్ఞానము విజ్ఞానమనఁగా అనుభవజ్ఞానము. పరబ్రహ్మానుభవము. విచారపరిపాక నిష్పన్నమైనది విజ్ఞానము.

బ్రహ్మంబెట్టిదియను ప్రశ్నకు నీ రెండవశ్లోకంబున " బ్రహ్మము విజ్ఞాన స్వరూపమని భగవంతుఁడు సమాధానమిచ్చెను. బ్రహ్మమును తెలియు విజ్ఞానమెవనికో యొకనికి లభ్యమగునుగాని సర్వులకు లభ్యమగుట కష్టమని పలుకుచున్నాఁడు.

3. " మనుష్యాణాంసహస్రేషు కశ్చిద్యతతిసిద్ధయే ।
" యతతామపిసిద్ధానాం, కశ్చిన్మాంవేత్తితత్త్వతః ॥

మనుష్యులలోఁ గోటులలో నొకఁడు సిద్ధికొఱకు యత్నము చేయును. అట్లు
యత్నిం ...చు మహాపురుషులలోను నెవ్వఁడో యొకఁడు నన్నుఁ జక్కఁగా నెఱుఁగు
...ము.
నని భా...

సర్వులందు " నహం" ప్రత్యయమున్నది. అహంప్రత్యయము యొక్క లక్ష్యా
ర్థమే ...బ్రహ్మము. కావున సర్వులయందు బ్రహ్మముండినట్లాయెను. తజ్జ్ఞానమేల
య ...ఱియందు నుపలబ్ధము కాకూడదని ప్రశ్నవచ్చునను సందేహమునంది భగవం
...డీరీతిఁ బలుకుచున్నాఁడు. అనేకజన్మార్జిత పుణ్యసమూహముచేఁ గలిగిన చిత్తపరిపాకమునం బుట్టిన వివేకవైరాగ్య శమదమ సన్న్యాసాదులగు నుత్తమసాధనములు గలవారికే పరమేశ్వరానుగ్రహము గలిగి శ్రవణమననాదులచే వ జ్ఞానము సిద్ధించునుగాని మలినచిత్తులయి యీశ్వర కృపాదూరవర్తులయి కామాగ్ని దహ్యమానులగు వారికి సిద్ధింపదు. సూర్యప్రభ సర్వగతమయినను నంధులకు సిద్ధింపదుగాదా. కావున జ్ఞానము దుర్లభము. " మనుష్యాణాం సహస్రేషు " అని చెప్పినదేలయన మనుష్యులకుఁదప్ప నితరులకు బంధమోక్షజ్ఞానములేవని సూచించుటకు. సిద్ధుల లక్షణమేమనినః-ఎవ్వనిచిత్తము పుణ్యాదృష్ట సర్వవిషయ విముఖంబై శ్రవణాదికము

నందే నిలుచునో యతఁడే సిద్ధుఁడు. ఇఁకఁ బరమేశ్వరుఁడు "సర్వంఖల్విదంబ్రహ్మ" యను నర్థమనుసరించి జగత్తు సర్వము బ్రహ్మమేయని బోధించుటకునై బ్రహ్మము తాను నిర్వికారంబైనను బ్రకృతిద్వారంబున దానికి జగత్కారణత్వము సిద్ధించుట కొఱకు మొదట తన యపరప్రకృతిని నిరూపించి పిదపఁ బరప్రకృతి విషయము బోధించుచున్నాఁడు. ఎటులనిన:—

4. "భూమిరాపోనలో వాయుః ఖంమనో బుద్ధిరేవచ ।
"అహంకార ఇతీయంమే, భిన్నాప్రకృతిరష్టధా ॥

పృథివ్యప్తేజో వాయురాకాశములను పంచభూతములును మనోబుద్ధ్యహంకారములను, గూడిన నాప్రకృతి యెనిమిదివిధములుగ భిన్నమయియున్నది. ఇది నా యపరప్రకృతియని తాత్పర్యము.

పైనఁ జెప్పఁబడిన పృథివ్యప్తేజో వాయురాకాశములు స్థూలపంచభూతములు. వీని సూక్ష్మావస్థారూపంబులగు గంధరసరూప స్పర్శశబ్దంబులే పంచతన్మాత్రములని పిలువఁబడును. ఈ పంచతన్మాత్రములే యిచట లక్షితంబయినవి. ఇవి స్థూలములకుఁ గారణభూతములు. ఇఁక మనశ్శబ్దముచే సంకల్ప వికల్పాత్మక కరణమగు నహంకారమని యన్వయింపవలెను. బుద్ధియన నిశ్చయాత్మక కరణవిషయంబని భావింపవలెను. అహంకారమన నభిమాన విశేషాత్మకంబగు నవిద్యయని తలంపవలెను. అహంకారవాసనావిశిష్టంబగు నవిద్యాత్మమయిన యవ్యక్తరూపమేయిచట లక్షితము. ఈ యష్టవిధ భిన్నాత్మకమయినట్టియు సర్వకార్యైక వేద్యమగునట్టియు ప్రకృతియే మాయయనంబడును. ప్రకృతిమాయను నుపాధిహేతువుగ నుండును. దీని కార్యమే యీ మరుమరీచికా సమానంబగు జగజ్జాలము. సాంఖ్యులిరువదినాల్గు తత్వములని నిర్ధరించినారు. అవియెవ్వియన,

(1) పృథివ్యప్తేజో వాయురాకాశములని పంచభూతములు 5
(2) గంధరసరూపశబ్ద స్పర్శాది తన్మాత్రములైదు 5
(3) వాక్పాణిపాదపాయూపస్థలను కర్మేంద్రియములు 5
(4) శ్రోత్రత్వక్చక్షుర్ఘ్రాణ రసనములను జ్ఞానేంద్రియములు 5
(5) మనోబుద్ధి చిత్తాహంకారములు 4

పైరీతిగ సాంఖ్యులు ( కపిల ) ఇరువదినాల్గు తత్వములనిరి. పై తత్వభేదములన్నియు భగవంతునిచేఁ బలుకఁబడిన యష్టవిధ తత్వములలో నంతర్భూతములని తెలియవలెను. ఇదియ పరప్రకృతి నికృష్టమైనది. అశుద్ధమైనది. అనర్థమైనది.

సంసారబంధనాత్మకమైనది. ఇంక శుద్ధమైన పరప్రకృతి యెట్టిదనః—

5. “ అపరేయమితస్త్వన్యాం, ప్రకృతింవిద్ధిమేపరాం ।

6. “ జీవభూతాం, మహాబాహో, యయేదంధార్యతేజగత్ ॥

పూర్వోక్తప్రకృతికంటె నితరమును పరిశుద్ధమయిన నాకాశభూతమైన దానిని జీవభూతమయి యీ జగమునంతయు ధరించుచున్న దానిని నా పరప్రకృతియని తెలియుమనిభావము సర్వభూతంబులకును నా రెండుప్రకృతులే కారణములు. అందువలన నేను సమస్తజగత్తునకును నుత్పత్తివినాశములకుం గారణంబని భావము. ఈ పరాపరసంఖ్యయగు ప్రకృతిద్వయము కారణముగాఁగలవి జంగమస్థావరసంఖ్యంబులగు సర్వభూతంబులు. అందు జడప్రకృతి దేహరూపమునఁ బరిణమించుచున్నది. మదంశము భూతమయిన చేతనప్రకృతియో భోక్తయయి దేహములందుఁ బ్రవేశించి స్వకర్మముచే దానిని ధరించుచున్నది.

7. “ మత్తఃపరతరంనాన్యత్కించిదస్తి ధనంజయ ।

“ మయిసర్వమిదంప్రోతం, సూత్రేమణిగణాఇవ ॥

అర్జునా! నాకంటె నితరమైన స్వతంత్రకారణమేదియులేదు. సూత్రమునందు మణులుంబలె నాయందు జగత్తు సమస్తమును నిలిచియున్నది. సాంఖ్యులు ప్రధానమను ప్రకృతి కారణమనిరి. నైయాయికులు పరమాణువులు నుపకృతి కారణమనిరి. అవిప్రమాణములు కావని నిరాకరించుచుఁ బరబ్రహ్మమే కారణమని యిందు స్థాపింపఁబడినది. సర్వమునందుఁగల సత్త నేనేనని భగవంతుఁడిట్లు చెప్పుచున్నాఁడు.

8. “ రసోహమప్సుకౌన్తేయ, ప్రభాస్మిశశిసూర్యయోః ।

“ ప్రణవస్సర్వవేదేషు శబ్దఃఖేపౌరుషంనృషు ॥

9. “ పుణ్యోగంధఃపృథివ్యాంచ తేజశ్చాస్మివిభావసౌ ।

“ జీవనంసర్వభూతేషు తపశ్చాస్మితపస్విషు ॥

10. “ బీజమాంసర్వభూతానాం, విద్ధిపార్థసనాతనం ।

“ బుద్ధిర్బుద్ధిమతామస్మి తేజస్తేజస్వినామహం ॥

11. “ బలంబలవతాంచాహం కామరాగవివర్జితం ।

“ ధర్మావిరుద్ధోభూతేషు కామోస్మిభరతర్షభ ॥

12. “ యేచైవసాత్వికాభావా రాజసాస్తామసాశ్చయే ।

“ మత్తయేవేతితాన్విద్ధి నత్వహంతేషుతేమయి ॥

అర్జునా! జలమందలి రసమును, సూర్యచంద్రులయందలి తేజస్సును వేద

ములయందలి యోంకారమును, ఆకాశమునందలి శబ్దమును, పురుషులయందలి పురుషాకారమును, భూమియందలి సుగంధమును, వహ్నియందలి తేజస్సును, భూతములందలి జీవనమును, తపస్వులందలి తపస్సును, భూతములకు ననాద్యుత్పత్తికారణమును, బుద్ధిమంతుల బుద్ధియును, తేజశ్శాలుర తేజస్సును, బలవంతులయొక్క కామరాగములులేని బలమును, భూతములయొక్క ధర్మవిరుద్ధముకాని కామమును సత్వగుణ ప్రధానములగు పదార్థములును, రజోగుణ ప్రధానములగు పదార్థములును, తమోగుణ ప్రధానములగు పదార్థములును, నివియన్నియును నేనేను. నావల్లనే పుట్టుచున్నవని తెలియుము. నేను వానికి వశుఁడనుగాను. అవిమాత్రము నా యధీనములైయుండును. ఇట్టి నిత్యశుద్ధ బుద్ధముక్త స్వభావుఁడును సర్వభూతాత్మను నిర్గుణుఁడను సంసార బీజశోష ప్రదాహకారణుఁడనునగు పరబ్రహ్మమును జగత్తు తెలియఁజాలక యుండుటకుఁ గారణము ముందు బలుకుచున్నాఁడు.

13. " త్రిభిర్గుణమయైర్భావై రేభిస్సర్వమిదంజగత్ ।
" మోహితంనాభిజానాతి, మామేభ్యఃపరమవ్యయం ॥

అర్జునా! సత్వరజ స్తమోగుణాత్మకములగు పదార్థములచేత నీ జగత్తంతయు మోహితమగుచు, నిట్టిగుణములకంటె వ్యతిరేకముగను నాశములేకను నే నున్నానని తెలిసికొనఁజాలదు. అద్వితీయుఁడవై, పరిపూర్ణ సచ్చిదానంద ఘనుఁడవయి పరబ్రహ్మము నీవుండ నీలోకము నిశ్శేష సంసారదుఃఖ విచ్ఛిత్తికొఱకు, నెఱుంగఁ జాలకున్నది యేలయని ప్రశ్నింప నీవిధముగ భగవంతుఁడు సమాధానమిచ్చుచున్నాఁడు. అర్జునా! ఈ జగత్తు సత్త్వరజస్తమోభావములగు విషయానుభోగముల చేతను, రాగద్వేషాదులచేతను, సదసద్వివేకముఁజెఱచు యనాద్యవిద్యచేతను, విషయభోగలంపటచేతను మోహితమయి తద్గుణ విలక్షణుఁడగు పరబ్రహ్మమును నెఱుంగఁజాలదని పలికెను. ఇట్టి యవిద్యయను మాయను దిరస్కరించువిధ మెద్దియన భగవంతుఁడీరీతిః బలుకుచున్నాఁడు. అనౌపాధిక రూపమెఱుంగరామికి నిచటఁగారణము తెలుపఁబడినది.

14. " దైవీహ్యేషాగుణమయీ, మమమాయాదురత్యయా ।
" మామేవయేప్రపద్యన్తే మాయామేతాంతరన్తితే ॥

త్రిగుణాత్మకమైన మాయ యీశ్వరుఁడగు నాయది. దీని నతిక్రమించుట కష్టము. కావునఁ గర్మాదులనన్నిటిని విడిచి నన్నే యెవ్వరు శరణుపొందుచున్నారో వారీమాయను దాటఁగలరు.

ఈ శ్లోకమునకు భాష్యకారులు విశేషముగ నర్థము వ్రాసినారు. అది గంభీరగోళముగనున్నది. సులభవేద్యము కాదు. అయినను నాకు దెలిసినంతవఱకు సూక్ష్మముగ వ్రాయఁబూనెద.

అనాదిసిద్ధ మాయాపరవశతను దొలఁగించికొన నశక్య మగుటవలన నెప్పటికిని జగత్తునకుఁ దత్త్వజ్ఞానోపపత్తి సంభవింపదుగదా? అనఁగా "యనాద్యవిద్యారూపిణియగు మాయచేత ననాత్మయం దాత్మత్వ భ్రమచే మోహితులయి సంసారదుఃఖాగ్నిచే సంతపించుచుండు ప్రాణులు నెట్లు తరణముసిద్ధించును" అని ప్రశ్న.

భగవంతు నొక్కనినే శరణుపొందుటచేఁ దత్త్వజ్ఞానద్వారంబున మాయాతిక్రమము సంభవించును.

దురత్యయమని పలుకఁబడినదియే? అది యత్యయమెట్లుగును? జగత్తునకుఁ దత్త్వజ్ఞాన ప్రతిబంధగుణములు సత్త్వరజస్తమములు. ఈ గుణత్రయాత్మకము ముప్పురిత్రాడుబలె మిక్కిలిదృఢమై బంధహేతువగును. ఆకాశమునందు నీలవర్ణము వలెను నాత్మయం దాభాసరూపముగ నుండును. జలమునందు శైవాలముంబలె నాత్మకు నావరణమయినది. తత్త్వప్రతిభాసమును ప్రతిబంధించి యతత్త్వప్రతిభాసమునకు హేతువును నావరణ విక్షేపములను రెండుశక్తులుగలదియునగు నవిద్య సర్వప్రపంచ ప్రకృతియనఁగా నుపాదానకారణము. ఈ దైవీయనునదియే వైష్ణవీ మాయయనఁబడుచున్నది. రావణభాష్యములో నీ దైవీమాయకు "చతుష్పద్గా" యని నాలుగుత్కర్షములుగలదియని వర్ణింపఁబడినది. అవియెవ్వియనః—

(1) దైవీ-- యువతి-- ఎల్లప్పుడును యౌవనముగలది. వార్ధకము లేనిది.

(2) కుశల-- అఘటితమును ఘటించుసమర్థురాలు. ముహూర్త కాలిక స్వప్నమునందు నూఱుసంవత్సరములను భ్రాంతియెట్లుకలుగుచున్నదో యట్టుల జాగ్రత్తయందును భ్రమ కలిగించుచున్నది.

ఘృతప్రతీకా-- నెయ్యివలె మధురమైన యుపక్రమముగలిగి పరిణామమున విషమగునది.

వయునానివస్తే-- జ్ఞానమునాచ్ఛాదించునది.

ఇట్టిదీ దైవీమాయ. దీనిప్రభావమువాసిష్ఠరామాయణములోఁ జక్కఁగ వర్ణింపఁబడినది. ఇట్టిప్రభావము కలదికావుననే యిదిదురత్యంబనియు, దుర్జయంబనియు వర్ణింపఁబడినది. ఇట్టిమాయను దరింపశక్తియెట్లుగలుగు?

మాయసర్వస్వాతంత్ర్యము కలదిగాదు. ఎప్పుడంతఃకరణము, జ్ఞానప్రతిబంధకపాపముచే విడువఁబడినదై, జ్ఞానానుకూలపుణ్యముచే నిండినదియగునో యప్పుడతినిర్మలమగు దర్పణమండలమునందు ముఖమువలె నతిస్వచ్ఛమై సర్వకర్మత్యాగ శమదమాది పూర్వక గురూపసదన వేదాంతవాక్య శ్రవణమనన నిధిధ్యాసనములచే సంస్కృతమైన యంతఃకరణమునందు తత్త్వమస్యాది గురూపదిష్ట వేదాంతవాక్యములచే బుట్టినదియు, ననాత్మాకారశూన్యంబును నిరూపాధి చైతన్యాకారంబును సాక్షాత్కారాత్మకంబగు " అహంబ్రహ్మాస్మి " యను వృత్తి యుదయించుచున్నది. ఆ వృత్తియందుఁ బ్రతిఫలితంబగు చైతన్యము తత్క్షణమే, స్వవిషయంబును స్వాశ్రయంబునగు నవిద్యను, దీపము తమస్సునుంబోలె నున్మూలించుచున్నది. అంత నవిద్య నశించుటవలన నావృత్తితోఁగూడ నఖిలకార్య ప్రపంచమునకును నాశంబగును. ఉపాదానము నశించుటవలన నుపాదేయ నాశమగును.

ఈ శ్లోకమునఁగల " మమ " " మాం " యను శబ్దములలోని " అహం " ప్రత్యయమున సగుణబ్రహ్మోపాసనమునకా నిర్గుణ బ్రహ్మోపాసనమునకా యన్వయింపఁదగినదని చర్చజరిగి నిర్గుణ బ్రహ్మమునకేగాని సగుణబ్రహ్మమునకు నన్వయింపదని నిర్ధరించినారు.

అట్టిమాయచే నాచ్ఛాదింపఁబడినవారెవ్వరు? మాయ నతిక్రమించువారెవరయినదిన్ని యీక్రిందిశ్లోకములోఁ దెలియఁజేయుచున్నాఁడు.

15. " నమాందుష్కృతినోమూఢాః ప్రపద్యన్తేనరాధమాః ।
" మాయయాపహృతజ్ఞానా, ఆసురంభావమాశ్రితాః ॥

16. " చతుర్విధాభజన్తేమాం, జనాస్సుకృతినోర్జున ।
" ఆర్తోజిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీచపురుషర్షభ ॥

17. " తేషాంజ్ఞానీనిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే ।
" ప్రియోహిజ్ఞానినోత్యర్థ మహంసచమమప్రియః ॥

18. " ఉదారాస్సర్వఏవైతే జ్ఞానీత్వాత్మైవమేమతం ।
" ఆస్థితస్సహియుక్తాత్మా మామేవానుత్తమాంగతిం ॥

19. " బహూనాంజన్మనామంతే జ్ఞానవాన్మాంప్రపద్యతే ।
" వాసుదేవస్సర్వమితి సమహాత్మాసుదుర్లభః ॥

అర్జునా! పాపాత్ములు, మూఢులు, నరాధములు నగువారు మాయచే

నపహారింపఁబడిన జ్ఞానముకలవారయి రాక్షసభావము నాశ్రయించి నన్నాశ్రయింపఁజాలరు. ఆర్తులు, బ్రహ్మజిజ్ఞాసులు, నర్థార్థులు, జ్ఞానులు, నన్నుఁదప్పక సేవింతురు.

ఆ నాల్గుతెగలవారిలోను నొక్కనియందే భక్తిగలవాఁడును నిత్యయుక్తుఁడును, నగు జ్ఞానశ్రేష్ఠుఁడు. నే నాత్మజ్ఞానికి నిష్టుఁడనువాఁడును నాకుఁబ్రియమైనవాఁడు. పై ముగ్గురు నుత్కృష్టులుగాని, జ్ఞాని యాత్మయనియే నామతము. ఆరురుక్షుఁడగునట్టి జ్ఞాని సమాహితచిత్తుఁడగుచు నే ననెడి నుత్తమగతినిఁ బొందుటకుఁ బ్రవర్తించువాఁడగును. అనేకజన్మములు గడచినపిమ్మట జ్ఞానముగలవాఁడయి సర్వమును భగవంతుఁడేయని ప్రత్యగాత్మ స్వరూపుఁడనగు నన్నుఁబొందును, అట్టి మహాత్ముఁడు దొరకుట బహుదుర్లభము.

భగవంతుని నుపాసించుటచే సర్వానర్థకరియగు మాయను తరింతురేని మీమాంసక, తార్కికాదులగు మహాపండితులందఱు నెందువలన నిన్నుపాసింపరనిన వారు జననమరణాది దుఃఖప్రదమగు కామ్యలక్షణమైన కర్మములుగలవారు కావున వారు దుష్కృతులు. అట్టి మీమాంసకులు పండితులైనను గామాదిరూపిణియగు మాయచే నపహృత జ్ఞానముగలవారగుటచే వారికి నసురభావము తప్పదు. తార్కికులును వైశేషికులును నదే కారణంబున మూఢులై యున్నవారు. చార్వాక జైన బౌద్ధాదు లదే కారణంబున నరాధములు. వీరు దంభదర్పాభిమాన పారుష్యాద్యభినివేశముగలవారలై నన్ను భజింపరు. ఈ మాయాదేవి యెట్టిదనిన:—

" దుస్సంకల్పవికల్పకూలయుగలా ధైర్యద్రుమోన్మూలినీ ।
" కల్లోలైరభిమాన మత్సరముఖైః షడ్భిః పరీతోర్మికా ॥
" ఆవర్తైర్మమతాదిభిః పరివృతా దుఃఖైకధారాన్వితా ।
" పూర్ణా మోహపయస్వినీ సనిభృతం చేతః స్థితా మాయినాం ॥

మాయావశులగువారి మనోగతి, దుష్టములయిన సంకల్ప వికల్పములను రెండుగట్టులుకలదియు, ధైర్యమను వృక్షమును పెకలించునదియును అభిమానమత్సరాదులను తరంగములు గలదియును మమతాదులను సుడులచేఁ జుట్టఁబడినదియును దుఃఖమనుధారతోఁ గూడినదియును మోహమను జలముగలదియు నగుచుండును. కావునవారు నన్నాశ్రయింపరు.

మహాపండితులగతియే యీరీతిగ నుండినచో మఱియెవరు తరింతురనిన:- శుద్ధాత్ములయి నేనే సర్వేశ్వరుఁడను నిశ్చయజ్ఞానముగలవారు తరింతురని సమాధానము. పైనఁ బలుకఁబడిన నాలుగువిధముల భక్తులలో నిర్విశేష పరబ్రహ్మమే

యుపాస్యమనియెన్ను బ్రహ్మవిదుఁడుమాత్రము మాయనుతరించునని భావము. మిగతవారు నన్ను భజించుచుండినను మాయను తరింపఁజాలరని యర్థము. వారి గతి యేమనిన.

20. కామైస్తైస్తైర్హృతజ్ఞానాః ప్రపద్యన్తేన్యదేవతాః ।
తంతంనియమమాస్థాయ ప్రకృత్యానియతాస్స్వయా ॥

21. యోయోయాంయాంతనుంభక్తశ్శ్రద్ధయార్చితుమిచ్ఛతి ।
తస్యతస్యాచలాంశ్రద్ధాం తామేవవిదధామ్యహం ॥

22. సతయాశ్రద్ధయాయుక్తస్తస్యారాధనమీహతే ।
లభతేచతతఃకామాన్ మయైవవిహితాన్హితాన్ ॥

23. అన్తవత్తుఫలంతేషాం తద్భవత్యల్పమేధసాం ।
దేవాన్దేవయజోయాన్తి, మద్భక్తాయాన్తిమామపి ॥

24. అవ్యక్తంవ్యక్తిమాపన్నం మన్యన్తేమామబుద్ధయః ॥
పరంభావమజానన్తో మమావ్యయమనుత్తమం ॥

అర్జునా! జనులాయాకోరికలచేత నపహరింపఁబడిన వివేకముగలవారయి తమప్రకృతిచే నియమితులై యాయానియమముల నాచరించి యితరదేవతల సేవించుచున్నారు. శ్రద్ధతోఁగూడి యేయేదేవతను బూజించునో వానికి నట్టిశ్రద్ధను నేనే స్థిరముచేయుచున్నాను. ఆయా దేవతలను బూజింపుచు నేయేకోరికలను గోరునో యాకోరికలను నేనే ఫలింపఁజేయుచున్నాను. అయిన నాఫలము లల్పబుద్ధులకు శాశ్వతముగ నిలువవు. ముఖ్యము దేవతల నారాధించువారు దేవతలను బొందుదురు. మున్ను నాచేఁ బలుకఁబడినరీతిగ నన్నారాధించువారు నన్నుఁబొందుదురు. ఉత్తమమగు నా స్వరూపము నల్పమతులు తెలిసికొనఁజాలక ప్రపంచాతీతుఁడగు నన్ను మనుష్యమాత్రునిగఁ దలంచుచున్నవారు కావున నన్నుబొందనేరరు. అవిద్యచే నుపహతమైన చిత్తముగలవారయి యెంతపండితులుగ నుండినను మద్విషయకజ్ఞానము విపరీతముగ నుండునుగాని సమీచీనముగ నువయింపదు. ఆత్మానాత్మస్వరూప వివేచనమునందును తత్త్వావధారణమునందును నారికివిపరీతబుద్ధి కలుగుచుండును కావున నట్టివారికి ముక్తిప్రాప్తిలేదని తెలుపఁబడినది. ఏల భగవంతుఁడగు తన్ను లోకులెఱుంగఁజాలకున్నారనుటకుఁ గల కారణములు తెలుపుచున్నాఁడు.

25. నాహంప్రకాశస్సర్వస్య యోగమాయాసమావృతః ।
మూఢోయంనాభిజానాతి లోకోమామజమవ్యయం ॥

26. వేదాహంసమతీతాని వర్తమానానిచార్జున ।
భవిష్యాణిచభూతాని, మాంతువేదనకశ్చన ॥

27. ఇచ్ఛాద్వేషసముత్థేన ద్వంద్వమోహేనభారత ।
సర్వభూతానిసమ్మోహం సర్గేయాన్తిపరన్తప ॥

నేను గుణాత్మకమైన మాయచేఁ గప్పఁబడినవాఁడ నగుటవలన నన్ను సర్వ జనులకు నెఱుంగశక్యముకాదు. అందువలన మూఢులైన జనులు జన్మనాశరహితుండనగు నన్ను గుఱ్తెఱుంగరు. నేను భూతభవిష్యద్వర్తమానములగు భూతముల నన్నిటిని నెఱుంగుదును. నన్నుమాత్ర మెవ్వఁడు నెఱుఁగఁడు. కావున నన్ను భజింపఁడు, సర్వప్రాణులును బుట్టునప్పుడే రాగద్వేషాది ద్వంద్వములచేఁగలుగు మోహమునఁజేసి మోహితులయి పుట్టుచున్నారు కావున నన్నెఱుంగరు. పదమూఁడవ శ్లోకమగు "త్రిభిర్గుణమయైః" యనుచోటి" అనౌపాధిక రూపంబెఱుఁగరామికిఁ గారణము చెప్పఁబడినది. ఇచట సోపాధికరూప మెఱుంగమికిఁ గూడఁ గారణము చెప్పఁ బడినది. అనాద్య నిర్వాచ్యమగు నజ్ఞానముచే నాచ్ఛాదితుఁడగుటవలననే, మద్విష యంబున లోకమునకు మూఢతయు, మదీయ స్వరూపవివేకము లేమివలన మన్నిష్ఠ తయు లేకపోవును.

" యోగమాయా సమావృతః ॥ అనఁగా:—తనవృత్తిచేఁ బురుషుని జననమరణ దుఃఖప్రవాహముతో యోజయతి " కూర్చుచున్నది కావున యోగము. అట్టిమాయ యోగమాయ. దానిచేఁ దమోరూపమైన దానిచే సమావృతము యోగమాయా సమావృతము:—సూర్యప్రకాశకమైన నేత్రము కాచపటలముచే నావృతముకాఁగానే నంధుఁడను నను నధ్యాసముచేఁ బురుషుండంధుండగుచు న్నాఁడో యటులనే యాత్మప్రకాశకమైన జ్ఞాననేత్ర మావరణాత్మకమయినమాయచే నావృతముకాఁగా నధ్యాసముచే నీలోకమజ్ఞమగుచున్నదని భావము.

" యోగమాయాసమావృతః " యనుటకు మఱియొకయర్థము.

యోగమనఁగా పరమాత్మ సంకల్పము. దానికి వశవర్తినియగు మాయ యోగమాయ. దానిచేత నావరింపఁబడినవాఁడను కావున యోగమాయా సమా వృతుఁడనని యర్థము. ఇచట దైవసంకల్పమే మాయకుఁ గారణమాయెను.

పై శ్లోకములో " యోగమాయా సమావృతః " యని పలికి మరల నాహం " యని పలుకఁబడినది. అనఁగా:—యోగమాయచే సమావృతుఁడ నను నేను సమావృతుఁడఁగానని విరుద్ధార్థమగుచున్నది. సమాధాన మేమ

నిన, యోగమాయ స్వాశ్రయమును వ్యామోహింపఁజేయునదికాదు. సూర్యుఁడు కలుషోదకమునందుఁ బ్రకాశించునపుడు సూర్యుని ప్రకాశమాకలుషోదకముచే నావరింపఁబడుచున్నదిగాని సూర్యుఁడావరింపఁబడఁడుగదా? ఆత్మయందు మాయావృతత సంభవింపదు.

" చిత్సంవిత్సుఖరూప మాత్మనికథంమాయావృతత్వంభవే
" న్మార్తాండస్తమసావ్రియేతకిము హేలోకిస్త్వీక్షణంపశ్యతాం ॥
" అజ్ఞానేనపిధీయతే జలముచేవార్క స్తదుక్తంద్విధా ।
" విక్షేపావరణాభిదం మునివరైర్మోహస్య శక్తిద్వయం ॥

చిత్సం విత్సుఖరూపుఁడగు నాత్మయందు మాయావృతతయెట్లు సంభవించును? సూర్యుఁడు తమస్సుచే నావరింపఁబడునాయేమి? చూపరుల దృష్టియే యావరింపఁబడుచున్నది. మేఘముచే సూర్యుఁడుబోలె నజ్ఞానముచేఁ గప్పఁబడుచున్నాఁడు. ఆ యజ్ఞానముయొక్క శక్తులు విక్షేపావరణములని రెండువిధములని మునివరులచేఁ దెలుపఁబడినది.

సర్వభూతంబులును జన్మమునొందునపుడే సమ్మూఢములయి భగవత్తత్త్వపరిజ్ఞాన శూన్యంబులగుటచే భగవద్భజన పరాఙ్ముఖంబులగు నేనిభజనాధికారి లేమింజేసి యనర్థకమగునుగదా యని శంకింప భగవంతుఁడీరీతిఁ బల్కుచున్నాఁడు.

28. " ఏషాంత్వన్తగతంపాపం జనానాంపుణ్యకర్మణాం ।
" తేద్వన్ద్వమోహనిర్ముక్తా భజన్తేమాం దృఢవ్రతాః ॥
29. " జరామరణమోక్షాయ, మామాశ్రిత్యయతన్తియే ।
" తేబ్రహ్మతద్విదుఃకృత్స్న మధ్యాత్మంకర్మచాఖిలం ॥
30. " సాధిభూతాధిదైవంమాం అధియజ్ఞంచయేవిదుః ।
" ప్రయాణకాలేపిచమాం, తేవిదుర్యుక్తచేతసః ॥

అర్జునా! పుణ్యకర్మము లధికముగాఁ జేసినవారెవ్వరికిని బాపము క్షయము నొందునో యట్టిజనులుమాత్రము ద్వన్ద్వమోహముచే విడువఁబడినవారయి దృఢవ్రతులై నన్నుభజింతురు వారు జరామరణ మోక్షముకొఱకు నాయందే సమాహితమైన చిత్తముగలవారయి యెవ్వరు యత్నముచేయుచున్నారో వారు పరబ్రహ్మము నెఱుంగుదురు. అదియే సమస్తప్రత్యగాత్మ వస్తువనియును సమస్తకర్మంబనియును తెలియుదురు. అధిభూతముతోను నధిదైవముతోను నధియజ్ఞముతోను నన్నెవరెఱుంగుదురో వారు సమాహితచిత్తులై మరణకాలమునందుగూడ నన్నే ఱుంగుదురని భావము.

అనేకజన్మములందును సుకృతాచరణమువలన దురితక్షయమునొంది ద్వంద్వప్రయుక్త మోహరహితులయి బ్రహ్మచర్యాది నియమవంతులు భగవద్భజనాధికారులగుదురు కావున భజనాధికారులు లేకనున్నదితప్పు. అట్టివారు కొందరేని వారును నన్నేలభజింతురనిన జనన మరణాదులనుండి ముక్తినందుటకుగాను. తాత్పర్యము.

చిత్సం విద్రూపంబున హృదయములోపల నున్నవాఁడై ప్రత్యగాత్మ వెలుఁగుచున్నాఁడు. అతఁడే బాహ్యముగా భూమ్యాదిభూతములం దుత్తమగుణములచేఁ బ్రవేశించి వెలుఁగుచున్నాఁడు. వేదములం దోంకారరూపుఁడై సూర్యునియందు తేజస్సై వీరవంతునందు వీర్యమై వ్యాపించియున్నాఁడు. అట్టివాని నెవ్వఁడె ఱుంగుచున్నాఁడో యతఁడే నాస్వరూపమని విజ్ఞానయోగంబని పేరుఁగల యీ సప్తమాధ్యాయంబునఁ బలుకఁబడినది.

పై యధ్యాయాంతమున భగవంతునిచేఁ దెలుపఁబడిన యధ్యాత్మాది సప్తవిధంబులగు పదార్థముల స్వరూపము దెలియఁగోరినవాఁడయి యర్జునుండీ విధముగఁ బ్రశ్నించెను.

" కింతద్బ్రహ్మకిమధ్యాత్మం, కింకర్మ పురుషోత్తమ ।
" అధిభూతంచకింప్రోక్త మధిదైవంకిముచ్యతే ॥
" అధియజ్ఞఃకథంకోఽత్ర, దేహేఽస్మిన్మధుసూదన ।
" ప్రయాణకాలేచకథం, జ్ఞేయోఽసినియతాత్మభిః ॥

కృష్ణా:—(1) బ్రహ్మమననేని (2) అధ్యాత్మమేది (3) కర్మమనసెట్టిది (4) అధిభూతమననేది (5) అధిదైవమేది (6) అధియజ్ఞుఁడెవ్వఁడు. (7) మరణసమయమున నేవిధంబున సమాహితచిత్తులచేత నీవెటుల తెలియఁబడుదువు తెలుపుమని అర్జునుఁడు ప్రార్థించెను.

బ్రహ్మము:—సోపాధికమా? నిరుపాధికమా?

ఆత్మ:—శ్రోత్రాదికరణగ్రామమా? ప్రత్యక్చైతన్యమా?

కర్మ:—కర్మము యజ్ఞరూపమా? ఇతరమా?

అధిభూతము:—పృథివ్యాదిభూతముచే వివక్షింపఁ బడినదా? లేక సమస్త కార్యజాతమే వివక్షింపఁబడినదా?

అధిదైవము:—దేవతావిషయమగునను ధ్యానమా? ఆదిత్యమండలాది సర్వదైవతములయందను స్యూతమగు చైతన్యమా?

అధియజ్ఞః:—యజ్ఞాధిగతుఁడగు దేవతాత్మయా? పరబ్రహ్మమా? ఈ దేహమందున్న వాఁడా ? తద్వ్యతిరిక్తుఁడా?

పై ప్రశ్నలకు భగవంతుఁడీక్రింది మూఁడుశ్లోకములచే బదులుచెప్పు చున్నాఁడు.

3. " అక్షరంబ్రహ్మపరమం, స్వభావోఽధ్యాత్మముచ్యతే ।
" భూతభావోద్భవకరో, విసర్గఃకర్మసంజ్ఞితః ॥

4. " అధిభూతంక్షరోభావః, పురుషశ్చాధిదైవతం ।
" అధియజ్ఞోఽహమేవాత్ర, దేహేదేహభృతాంవర ॥

5. " అన్తకాలేచమామేవ, స్మరన్ముక్త్వాకళేబరం ।
" యఃప్రయాతిసమద్భావం, యాతినాస్త్యత్రసంశయః ॥

(1) బ్రహ్మమననేది యనుటకు నుత్తరము. " అక్షరంబ్రహ్మపరమం " యను వాక్యము ప్రత్యుత్తరము. అక్షరశబ్దమునందున వినాశిత్వము. సర్వవ్యాప్తి మంతము నుండుటచే నిరుపాధికుఁడగు పరమాత్మయని యర్థము.

(2) అధ్యాత్మమననేమి? " స్వభావోధ్యాత్మముచ్యతే " యని సమాధానము స్వకీయమైనభావము స్వభావము. శ్రోత్రాదీంద్రియ సముదాయము ఆసము దాయమే " అహంప్రత్యయ వేద్యమగు దేహమందున్నది గావున ప్రత్యగాత్మభావము అనఁగా జీవభావము స్వభావశబ్దమున కర్థమని తెలియ వలెను.

(3) కర్మమననేమి? " భూతభావోద్భవకరః " యని సమాధానము. భూతవస్తు వులను కలుగఁజేయునట్టి దేవతలనుద్దేశించి మంత్రపూర్వకముగ నగ్నియందుఁ జరుపుపురోడాశాదికమును సమర్పించుయజ్ఞము కర్మమనఁబడును. సకలభూత ములకు నుత్పత్తిస్థితిలయములు కలిగించునది యజ్ఞము.

(4) అధిభూతమననేమి? " అధిభూతంక్షరోభావః " అని సమాధానము. జనన మరణములుగల ప్రాణిజాతము నాధారమును జేసికొనునట్టిది అధిభూతమనఁ బడును.

(5) అధిదైవమననేమి? " పురుషశ్చాధిదైవతం " అని సమాధానము. పురుషుఁ డనఁగా సర్వమునందును నిండియున్నవాఁడనిగాని దేహమునందు నివసించిన వాఁడనిగాని యర్థము. ఆదిత్యాది మండలాంతర్గతుండును సకలప్రాణుల యింద్రియములకు ననుగ్రాహకుఁడును నగు హిరణ్యగర్భుఁడే యధిదైవమని తెలియవలెను.

(6) అధియజ్ఞుఁడెవఁడు? సర్వయజ్ఞాభిమానియగు విష్ణుదేవత యధియజ్ఞుఁడనఁబడును. ఇతఁడు దేహమునందేయున్నవాఁడుగాని తద్వ్యతిరిక్తుఁడు కాఁడు.

(7) మరణకాలమున నీవెట్లుఁ దెలియఁబడుదువు?
దేహేంద్రియాదులం "దహంమమ" యనునట్టి యభిమానములేనివాఁడయి సదాకాలమందు నెడతెగక భగవదనుసంధానమునుఁ జేయుచుఁ గళేబరమును విడిచిపోవువాఁడు నిస్సందేహముగ మోక్షమందును.

ముఖ్యప్రశ్నలకు సమాధానంబులివి. ఇఁక నుపప్రశ్నములకు సమాధానములు గ్రంథబాహుళ్య భీతినివ్రాయనైతిని. అంత్యకాలమున భగవదనుసంధానము గుదురనివానిగతి యేమగుననిన భగవంతుఁడీరీతిఁ బలుకుచున్నాఁడు.

6, " యంయంవాపిస్మరన్భావం, త్యజేదన్తేకళేబరం ।
" తంతమేవైతికౌన్తేయ సదాతద్భావభావితః ॥

7. తస్మాత్సర్వేషుకాలేషు మామనుస్మరయుధ్యచ ।
మయ్యర్పితమనోబుద్ధి ర్మామేవైష్యస్యసంశయః ॥

అర్జునా! మరణకాలమునందు నేయే దేవతారూపములను స్మరించుచు దేహమునువదలునో, యట్టిసంస్కారముగలవాఁడై యాయాదేవతాస్వరూపములనుపొందును. అనఁగా మరణకాలమునందెట్టి తలంపుకలవాఁడగునో దానికిఁదగిన జన్మమును బొందుననితాత్పర్యము. పై కారణముచే దేహత్యాగ సమయమునందలి భావన దేహాంతరప్రాప్తికి హేతువగునుగనుక సర్వకాలములందును నన్నుస్మరింపుము. శాస్త్రోక్తప్రకారముగ యుద్ధముచేయుము. మనోబుద్ధులను నాయందేయుంచుము. అటులయిన నన్నుఁబొందఁగలవు, సందియములేదు.

మరణకాలమునందు దేనిని స్మరించుచు దేహమును వదలునో యారూపమునే భ్రమరకీట న్యాయముగఁ బొందునని భావము. సదాకాలమొనరించు భావనయే యభ్యాస వశమున నంత్యమునకుఁ గారణము. ఈసందర్భమున యుద్ధమొనర్పుమనియేల బోధింపఁబడినదనిన:- మయ్యర్పితమనోబుద్ధిః యనువాక్యములో నంతఃకరణశుద్ధిముఖ్యము. తచ్ఛుద్ధికిఁ గర్మమావశ్యకము. అందునఁ గులధర్మాచరణము శ్రేష్ఠము కావున ఫలాభిసంధిని వదలినన్నె స్మరించుచు యుద్ధమొనర్పుమని బోధింపఁబడెను. మరణకాలమునఁబైనఁ బలికినరీతిగ భగవద్ధ్యానబుద్ధియెటుకలుగుననిన.

8. " అభ్యాసయోగయుక్తేన, చేతసానాన్యగామినా.
పరమంపురుషందివ్యం యాతిపార్థానుచింతయ॥

9. " కవింపురాణమనుశాసితార, మణోరణీయాం సమనుస్మరేద్యః
సర్వస్యధాతారమచింత్యరూపమా దిత్యవర్ణంతమసఃపరస్తాత్.

అర్జునా ! అభ్యాసమనియెడు యోగముతోఁ గూడికొనినదియు. నన్యాయత్తముకానిదియును నయినచిత్తముచేత సూర్యమండలాంతర్గత పరమపురుషుని ధ్యానము చేయుచున్నయెడల నాపురుషునే పొందెదవు. ఆగతానాగత వర్తమాన విషయములనన్నిటిని దెలిసినవాఁడును, సర్వకాలముల యందును నుండువాఁడును, సర్వలోకములకు నియామకుఁడును, కర్మలకును కర్మఫలములకును ప్రాణులకు విభజనకర్తయైనవాఁడును, సూర్యునివలె నిత్యచైతన్య ప్రకాశము కలవాఁడును, నజ్ఞానమనెడు మోహాంధకారమునకునతీతుఁడును నయిన పరమపురుషుని ధ్యానము సేయువాఁడాపురుషునే పొందునని తెలియుము. మరణకాలమునందే విధముగ నిశ్చలమగు మానసమునుపొంది సమాధియోగమున నుండవలెననునది భగవంతుడు బోధించుచున్నవాడు.

10. " ప్రయాణకాలేమనసాచలేన, భక్త్యాయుక్తోయోగబలేనచైవ
" భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్యసమ్య, క్సంపరంపురుషముపైతిదివ్యం.

ఏ పురుషుఁడు మరణకాలమునందు నిశ్చలమైనమనస్సుకలవాఁడును, సమాధిసంస్కారము వలనఁగలిగినచిత్త స్థైర్యమేస్వరూపముగాఁగలయోగబలము కలవాఁడును, భక్తికలవాఁడునగుచు, ముందుగఁ జిత్తమునుహృదయ పుండరీకమునందునిలిపిపిమ్మట హృగయపుండరీకమునుండి పైకిఁబోయిననాడీమార్గముగ భూమ్యాదితత్త్వముల జయించిప్రాణవాయువును భ్రూమధ్యమున స్థాపించిప్రమాద మేమియునులేనివాఁడయి పరమపురుషుని స్మరించునోయట్టి పురుషుఁడు ప్రకాశాత్మకమైనయాపరమపురుషునిఁబొందును.

" భక్త్యా యుక్తః " అనఁగాఁబరమేశ్వరునియందధికమైన ప్రేమకలవాఁడయి విషయాంతరముల మీదికిఁ జిత్తమును బోనీయకయుండవలెనని యభిప్రాయము.

ఆరీతినిగనునికి కలుగఁజేసికొనున భ్యాసమే సమాధియోగమనఁబడును. ఈయోగబలమునఁ జిత్తముపరమాత్మస్థానమును పుండరీకాకారమును నయిన హృదయమునందు బలవంతముగనిలుచును. చిత్తమటుస్వాధీనమయినపిదప హృదయమునకు దక్షిణోత్తర భాగములనుండి బయలువెడలిన యిడాపింగళయను రెండు నాడులనడ్డగించి హృదయమునుండి హృదయాగ్రమూలకము నూర్ధ్వగమనశీలమైన

సుషుమ్నయను నాడిచేతహృదయసంబంధమయిన ప్రాణవాయువును కంఠావలంబితముఁజేసి యచట స్తనసదృశముగనుండు మాంసఖండమును బొందించి యక్కడనుండియామార్గముగుండా ప్రాణవాయువును కనుబొమలనడుమఁ బ్రవేశపెట్టి ప్రమాదములేనివాఁడై బ్రహ్మరంధ్రమునుండి సనాతనుఁడగు పరమపురుషునిఁ బొందవలెను. భ్రూమధ్యమునఁ బ్రాణవాయువు నిలుపకమున్నే భూమిజయమును చేయవలెననిన పృథివ్యప్తేజోవాయ్వాకాశములనెడి యైదు భూతములను స్వాధీనచేష్టలు కలవానిగఁజేసికొనవలెనని భావము. మాంసపిండరూపముగనున్న హృదయమునకు సంబంధించిననాడులు నూటయొక్కటిగనుండును. వీనిలోనొకటిశిరస్సునుగురించి బయలువెడలి మీదికిఁబోయినది. ఈ నాడీద్వారమునఁబోవువాఁడు మోక్షమందును. ముందుగాకుంభక ప్రాణాయామము చేత ప్రాణాపానములనొక్కటిగఁజేసి స్థాపించియనంతరమున నిడ పింగళములనువదలి, సుషుమ్న యనునాడిచేతఁ బ్రాణవాయువును గనుబొమలమధ్యయందుఁ జక్కఁగలంబికాంతమునకుఁదెచ్చి పిమ్మట శీర్ష కపాలనుభేదించి వేదోక్తక్రమముగ పృథివ్యప్తేజోవాయ్వాకాశాత్మకమృత్యువులను జయించిపోవువాఁడు పరమపురుషునిఁ బొందును. ఈయోగమును గురించి పంచమాధ్యాయాంతమున విశేషముగవ్రాసినాను. దానినిఁజదువనగును. యోగులకీయోగము సర్వసామాన్యముగనుండు నేమోకాని, ఇతరులకు దుర్లభంబగు యోగమిది. ఈ మార్గముపాసకునకు నన్వయించునుగాని బ్రహ్మవేత్తకుఁగాదని భాష్యకారులు నిర్ధరించినారు. సర్వజనులు ప్రణవాభ్యాస యోగమనుసరించుచుఁ గాలాంతరమునఁబరమ పురుషునిఁబొందనగునని భగవంతుఁడీరీతిగఁ బలికెను.

11. "యదక్షరం వేదవిదోవదన్తి, విశంతియద్యతయో వీతరాగాః
యదిచ్ఛంతో బ్రహ్మచర్యంచరన్తి, తత్తేపదంసంగ్రహేణప్రవక్ష్యే.

వేదాంతులు దేనినియక్షరమందురో, వీతరాగులగు యతులు దేనినిఁ బొందుదురో, దేనినిఁదెలిసికొనుటకై గురుకులవాసము చేయుచు బ్రహ్మచర్యమును జేయుదురో యట్టిపదమును నీకుసంక్షేపముగాఁజెప్పెదను. వినుము. ఈశ్లోకమునకు భాష్యమునందు వీతరాగులకే సన్యాసాధికారమనిన్ని మందమధ్యమ బుద్ధులకు నోంకారోపాసనాభ్యాసమనిన్ని తెలుపఁబడినది. కేవలాభ్యాసయోగముకంటెను ప్రణవాభ్యాసమంతరంగసాధనమని యభిప్రాయము. సర్వోత్తమగతినిఁ బొందుటకుఁ [illegible]మార్గము భగవంతుఁడు మఱలనీరీతిగఁ బలుకుచున్నాఁడు.

"సర్వద్వారాణిసంయమ్య మనోహృదినిరుధ్యచ
మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణ, మాస్థితోయోగధారణాం.

సకలేంద్రియద్వారములగు నవద్వారములనుఁ జక్కఁగాబంధించి మనస్సును హృత్పుండరీకమునందు నిలిపి ప్రాణవాయువును శిరస్సునకు సమీపముననున్న కనుబొమలనడుమనుంచి యోగస్థైర్యము నాశ్రయించినవాఁడగుచు సర్వోత్తమమైన గతిఁబొందును. విషయదోషముల విమర్శించి యభ్యాసమువలన శ్రోత్రాదీంద్రియములను శబ్దాదివిషయములమీదికిఁ బోనీయక యింద్రియద్వారములను నియమించి యభ్యాసవైరాగ్యముచే మనస్సును వృత్తిరహితమైన దానినిగాఁజేసి హృదయమునం జేర్చి యటు స్వాధీనమయిన మనస్సుచేత హృదయముకంటె మీదికిఁ బ్రసరించిన నాడిచేతఁ, బ్రాణవాయువును పైభాగమునెక్కించి శిరస్సునకు సమీపమున నున్నకను బొమలనడుమనుంచి యోగధారణనవలంబించిన వాఁడు సర్వోత్తమ గతినిఁ బొందుచున్నాఁడని భావము. ఈ యోగధారణముఁ జేయువాఁడు బ్రహ్మముననగా నోంకారము నుచ్చరించుచు తదర్థమగు పరమపురుషుని స్మరించుచుండవలెను. ఇటు యోగధారణ నవలంబించినవానికిఁ గలుగు సుగతిని భగవంతుఁడు తెలుపుచున్నాఁడు.

13. " ఓమిత్యేకాక్షరంబ్రహ్మ, వ్యాహరన్మామనుస్మరన్ ।
" యఃప్రయాతిత్యజన్దేహం, సయాతిపరమాంగతిం ॥

14. " అనన్యచేతాస్సతతం, యోమాంస్మరతినిత్యశః ।
" తస్యాహంసులభఃపార్థ, నిత్యయుక్తస్యయోగినః ॥

15. " మాముపేత్యపునర్జన్మ, దుఃఖాలయమశాశ్వతం ।
" నాప్నువంతిమహాత్మానః, సంసిద్ధింపరమాంగతాః ॥

" ఓం " యనెడు నేకాక్షరమును బ్రహ్మముగా నుచ్చరించుచు నన్ను స్మరించుచు దేహమునువిడిచి యర్చిరాది మార్గమునఁ బోవునో వాఁడుత్తమగతినిఁ బొందును. మఱియొకదానియందుఁ జిత్తములేనివాఁడగుచు నెవఁడు నన్ను నిరంతరముఁ బ్రతిదినమును స్మరించునో యట్టి నిత్యయుక్తుఁడగు యోగికి నేను సులభముగ దొరకుదును. నన్నుఁబొందిన మహాత్ములు మోక్షమును బొందినవారే కనుక దుఃఖాశ్రయమును ననిత్యమునగు జన్మమును మరలఁబొందరు.

ఓంయనునక్షరము బ్రహ్మప్రతిపాదికమైనది. " ఓం " యక్షరార్థము బ్రహ్మమని తెలుపనగును. అర్చిరాది మార్గమనఁగా దేవమార్గమని యర్థము. పితృలోకమును జేర్చునది ధూమమార్గము. ప్రాణవాయువులను జయించినవాఁడు స్వేచ్ఛా మరణశక్తికలవాఁడగుననియు జయింపశక్తిలేనివాఁడు కర్మక్షయానంతర

ముందు దేహత్యాగము కలవాఁడగుచున్నాఁడనియు తెలుపఁబడినది. మామువేత్య యను వాక్యమునకు నా స్వరూపమందినవారని యర్థముచేయఁబడినది.

16. " ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోర్జునా ।
" మాముపేత్యతుకౌంతేయ, పునర్జన్మనవిద్యతే ॥

అర్జునా! బ్రహ్మలోకముతోఁగూడ సకలలోకములును, తిరిగివచ్చెడు స్వభావముకలవి. అనఁగా బ్రహ్మలోకముతోఁగూడ సకలలోకములలో నే లోకమునకుఁబోయినను నక్కడనుండి మరలవచ్చి పుట్టవలసినదేను. నా భావమునుబొందినవానికి మాత్రము మరలజన్మము కలుగదని తాత్పర్యము. బ్రహ్మజ్ఞానాగ్నిచేత నిర్దగ్ధములయిన కర్మములుకలవానికి బునరావృత్తికిఁదగిన కర్మము లేదుగనుక బ్రహ్మవేత్తకుఁ బునరావృత్తి లేదనియును బ్రహ్మజ్ఞానరహితునకు మాత్రము పునరావృత్తి కలుగుననియును తెలియఁగవలెను. బ్రహ్మలోకాదులకుఁ బునరావృత్తి కలుగుటకుఁ గారణంబులు భగవంతుఁడు పలుకుచున్నాఁడు.

17. " సహస్రయుగపర్యంత మహర్యద్బ్రహ్మణోవిదుః ।
" రాత్రింయుగసహస్రాంతాం, తేవోరాత్రవిదోజనాః ॥

18. " అవ్యక్తాద్వ్యక్తయస్సర్వాః, ప్రభవంత్యహరాగమే ॥
" రాత్ర్యాగమేప్రలీయన్తే తత్రైవావ్యక్తసంజ్ఞకే ।

19. " భూతగ్రామస్సయేవాయం, భూత్వాభూత్వాప్రలీయతే ।
" రాత్ర్యాగమేవశఃపార్థ, ప్రభవత్యహరాగమే ॥

వేదవేదాంగములయందుఁ జెప్పఁబడినవిధముగ బ్రహ్మదేవుని యొక్క రాత్రిం బగళుల పరిమాణమును దెలిసినవారు వేయియుగములయ్యేనేని బ్రహ్మకొక్క పగలనియును, బ్రహ్మయొక్క రాత్రికాలముకూడ వేయియుగములు పరిమితి కలదనియును చెప్పుచున్నారు. మానవ చతుర్యుగ సహస్రము బ్రహ్మకు నొక పగలు. అంతటికాలమే యొకరాత్రి. కావున బ్రహ్మకుసైతము కాలపరిచ్ఛిన్నము గలదుగాన బ్రహ్మలోకాదులు పునరావృతములుగలవియని బోధించుటే యీశ్లోకములయుద్దేశ్యము. బ్రహ్మదేవుని పగటికాలమున స్థావరజంగమ స్వరూపులగు సకలభూతము లగపడుచున్నవి. బ్రహ్మదేవుని రాత్రికాలమున నా భూతములన్నియు నతని నిద్రావస్థయందే యణఁగిపోవుచున్నవి. 18-వ శ్లోకమునందలి యవ్యక్తశబ్దము బ్రహ్మనిద్రావస్థయని యెఱుంగవలెను. పూర్వకల్పమునందుఁ బుట్టిన ప్రాణిసమూహ [illegible] బ్రహ్మకుఁ బగలువచ్చిన కాలమునందుఁబుట్టి రాత్రివచ్చిన కాలమునందు లీనమై

పోవుచున్నది. ఈరీతిగ సకలప్రాణి సముదాయమున్ను పుట్టిపుట్టి లీనమగుచున్నది. పూర్వకల్పమునందలి ప్రాణకోటులే నూతనకల్పమునఁ బుట్టునుగాని ప్రత్యేక ప్రాణకోటి 20-21 పుట్టదు. అట్లుప్రత్యేక ప్రాణకోటి పుట్టుననినచో ప్రాణులనుభవించెడు సుఖదుఃఖములు పూర్వపుణ్య పాపములవలన వచ్చినవి కావనియును పూర్వమునందలి పుణ్యపాపములు ఫలమునీయకయే నశించినవనియును చెప్పినట్లగును. దానినుండి యకృతాభ్యాగమ దోషమువచ్చును. బంధమోక్షములను బొందునట్టిప్రాణియొక్కటియును లేకపోవును. అటులయిన కర్మ జ్ఞానకాండప్రవృత్తియే నిష్ఫలమగును. ప్రతికల్పమునందును " అవిద్య, అస్మిత, రాగ, ద్వేష అభినివేశములను క్లేశపంచకము కారణముఁగాఁగల కర్మాశయమువలన భూతసముదాయము స్వతంత్రరహితమై జన్మవినాశ మనుభవించుచున్నది. పైశ్లోకత్రయముచే సర్వభూతసముదాయ మనిత్యమనియు యనాద్యక్షర పరబ్రహ్మమేనిత్యమని స్థిరపరచబడినది.

22. " పురుషస్సపరఃపార్థ, భక్త్యాలభ్యస్త్వనన్యయా ।
" యస్యాంతస్థానిభూతాని, యేనసర్వమిదంతతం ॥

అర్జునా! చరాచరాత్మకములగు సకలప్రాణులే పరమపురుషుని యొక్క మధ్యమునందున్నవో, యే పరమపురుషుని చేతఁ జరాచరాత్మకమైన యీ ప్రపంచమంతయును వ్యాపింపఁబడినదియో యట్టి పరమపురుషుఁడు ఆత్మవిషయజ్ఞానమగు భక్తి చేత నిశ్చయముగఁ బొందఁదగినవాఁడు. ఇచట భక్తియను పదమునకు జ్ఞానలక్షభక్తియని యర్థము. ప్రదక్షిణప్రాణాయామాది భక్తి కాదు. ఆత్మకంటె నితరమగుదాని విషయమునందలి భక్తి యిచటఁ బ్రయుక్తము కాదు. పరమపురుషునందు చరాచరములయిన సకలభూతములున్నవనుటకుఁ గారణంబేమనినఁ గార్యము కారణాంతర్వర్తియై యుండుట సహజముగనుక కార్యరూపములగు చరాచర భూతములన్నియును గారణుఁడగు పరమపురుషునందున్నవని యెఱుంగవలయు. ఆత్మ సర్వమునందు నాకాశమువలె వ్యాపించుదీప్తికలది. జ్ఞానదృష్టిచే విచారింపఁగ బ్రహ్మముకంటెను వేఱుగ జగత్తులేదని తెలియునది. ఇఁక మరణమునకు నేకాల ముత్తమమని ప్రశ్నింప దానికి భగవంతుఁడీరీతినిఁ బలుకుచున్నాఁడు.

23. " యత్రకాలేత్వనావృత్తి, మావృత్తించైవయోగినః ।
" ప్రయాతాయాన్తితంకాలం, వక్ష్యామిభరతర్షభ ॥

అర్జునా! ఏకాలమునందు మరణమునుబొందిన కర్మయోగులు పుట్టుదురో, యేకాలమునందు మరణమునుబొందిన యోగాభ్యాసకులు

చేయువారు ) పునర్జన్మమును బొందరో యట్టికాలమును జెప్పెదను వినుము. మార్గములు రెండు. దేవయానమార్గము. పితృయానమార్గము. దేవయానమార్గమునకు నర్చిరాదిమార్గమనియు పితృయాన మార్గమునకు ధూమమార్గమనియు పేరుగలదు. దేవయానమార్గము శ్రేష్ఠమయినది పితృయాన మార్గమంతటి శ్రేష్ఠముకాదు. పితృయాన మార్గమునఁ బోయిన ప్రాణులకుఁ బునరావృత్తి కలుగును. దేవయానమునఁబోయిన వారెవరో యొకరు తిరిగివత్తురు. దేవయానమునకు నుత్తరాయణము పితృయానమునకు దక్షిణాయనమని వచింపఁ బడినది. పితృయానమునఁ బోయినవానికిఁ గ్రమముక్తి కలుగదు. ఏ దేశోపాసకు లనఁగా బ్రహ్మముకానిదానిని బ్రహ్మబుద్ధితో నుపాసించువారు తటిల్లోకపర్యంతము పోయినవారయి, బ్రహ్మమును ధ్యానింపనివారగుటచే, నాలోకభోగముల ననుభవించినపిమ్మటఁ దిరిగివచ్చుచున్నారు. హృదయమునందు బ్రహ్మోపాసనము చేయువారు దహరాద్యుపాసకులు. భోగాంతమందు ముక్తులగుచున్నారు. కాలమనఁగా కాలాభిదేవతలని యర్థము. ఈ కాలాభిమాన దేవతలెటు మరణాంతమున జీవుని దేవయాన పితృయానమార్గములగుండా తీసికొని వెళ్లుచున్నదని గ్రంథములో విశేషముగ వ్రాసినారు. కాలాభిమాని దేవతయును, ప్రకాశాభిమాన దేవతయు, దివసాభిమాన దేవతయును, శుక్లపక్షాభిమాని దేవతయును నుత్తరాయణాభిమాని దేవతయునుగల మార్గమునఁబోయిన బ్రహ్మవేత్తలు క్రమముగ పరబ్రహ్మమును బొందుచున్నారు. ఇచ్చటఁ జెప్పఁబడినవారందఱు సగుణ బ్రహ్మోపాసకులగుదురుగాని నిర్గుణ బ్రహ్మోపాసకుల విషయమిచ్చటఁ బలుకఁబడలేదు, ఏలయన నిర్గుణమును బ్రపంచరహితమునునైన బ్రహ్మమే నేనని నిశ్చయజ్ఞానము గలవారికి ప్రాణోత్క్రమణమే లేదు. బ్రహ్మమునందు విలీనమైన ప్రాణములుకలవారయి బ్రహ్మస్వరూపులేయగుటవలన వారికి గమనాగమనములుండవు.

25. ఇఁక ధూమాభిమాని దేవతయును రాత్ర్యభిమాని దేవతయును కృష్ణపక్షాభిమాని దేవతయును, షణ్మాసాత్మకమైన దక్షిణాయనమున కభిమానియగు దేవతయునుగల మార్గమునఁ బోయిన కర్మయోగి చంద్రసంబంధ తేజస్సునుబొంది స్వర్గాదిలోకములనుఁజేరి పుణ్యముముగిసినపిమ్మట మరల మానవలోకమునకు వచ్చుచున్నాఁడు.

పై రెండుశ్లోకములచే మనమెఱుంగఁదగిన ముఖ్యవిషయమేమన, నివృత్తిఫాసకులకుఁ గ్రమముక్తికలుగుననియును కామ్యకర్మపరులకు స్వర్గభోగాను

భవానంతరము పునరావృత్తికలుగుననియును నిషిద్ధకర్మము లాచరించువారు నరకాను భవమైనపిదప మరలఫుట్టుచుండురనియును, క్షుద్రజంతువులకు నిచటనేమరల మరలజన్మము కలుగుచుండుననియును భాష్యకారుల యభిప్రాయము.

26. పైనఁ జెప్పఁబడిన రెండుమార్గములలో నుత్తరాయణమార్గము జ్ఞాన ప్రకాశమగుటచే శుక్లమార్గమనియును దక్షిణాయన మార్గమట్టిది కాదు కావున తమోమయమైన కృష్ణమార్గమనియును జెప్పఁబడినది. మొదటిదియగు శుక్లమార్గము జ్ఞానాధికారులకనియును, రెండవదియగు కృష్ణమార్గము కర్మాధికారుల కనియునుఁ దెలియవలెను. కర్మణాపితృలోకో విద్యయా దేవలోకః యను శ్రుతికిది సమ్మతముగ నున్నది. అర్జునా! ఈ మార్గములు రెంటినిఁ దెలిసిన ధ్యానయోగి యెవ్వఁడును మోహమునుబొందఁడు కావున నీవు సర్వకాలములయందును ధ్యానయోగపరుఁ డవుకమ్ము.

23. " వేదేషు యజ్ఞేషు తపస్సుచైవ, దానేషుయత్పుణ్యఫలంప్రదిష్టం ।
" అత్యేతితత్సర్వమిదంవిదిత్వా, యోగీపరంస్థానముపైతిచాద్యం ॥

అర్జునా! ఈ యధ్యాయమునందలి ప్రథమ ద్వితీయ శ్లోకముల చేతనడిగిన ప్రశ్నముల కేడింటికిని నాచేతఁ జెప్పఁబడిన ప్రత్యుత్తరములను దెలిసి యనుష్ఠించి ధ్యానయోగియగువాఁడు, నియమపూర్వకముగ వేదవేదాంగములు చదువుటవలనను, సంగోపాంగ సహితముగ యజ్ఞముల నాచరించుటవలనను, కాయశోషణాదులచేత కృచ్ఛ్రచాంద్రాయణాది తపస్సుల నాచరించుటవలనను దేశకాలపాత్రాను సారముగ దానముల నాచరించుటవలనను; కలిగెడు పుణ్యఫలము నతిక్రమించు చున్నాఁడు, అనఁగా నట్టిపుణ్యములు నికృష్టములని వదలుచున్నాఁడు. అటుచేయుటయెగాక సర్వకారణంబును సర్వోత్తమంబును నైన స్థానమనఁగా బ్రహ్మమును బొందుచున్నాఁడని యీ తారకయోగమను నపరనామంబుగల యక్షరబ్రహ్మ యోగము యొక్క ముఖ్యతాత్పర్యము.

# ప్రకటన.

బళ్ళారిలో వకీలుగానుండి కే. శే. కోలాచలం శ్రీనివాసరావుగారిచే రచియింపబడిన యీక్రింద వివరించిన ఉపన్యాసములన్నియును విక్రయమునకు సిద్ధముగనున్నయవి.

| | | |
|---|---|---|
| 1. | ఆర్యుల నాగరికతవారి ప్రపంచవ్యాపకత. | 0 - 8 - 0 |
| 2. | ఆర్యుల చరిత్ర, ఋగ్వేదభాష మొదలగునవి. | 0 - 8 - 0 |
| 3. | ఋగ్వేద విభజన వేదకాల విభజన మొదలగునవి. | 0 - 8 - 0 |
| 4. | ఆర్యులుపంజాబు చేరిన విధమువారిశాసనము. | 0 - 8 - 0 |
| 5. | మద్యపానము జూదము స్త్రీలగుణములు మొదలగునవి. | 0 - 8 - 0 |
| 6. | వివాహకట్టడములు ... | 0 - 8 - 0 |
| 7. | జాతికట్టడములు ... | 0 - 8 - 0 |
| 8. | సృష్టిని గురించిన తాత్పర్యము. | 0 - 8 - 0 |
| 9. | వేదమతము నాస్తికమతము ఆర్యులదైవములు. | 0 - 8 - 0 |
| 10. | నరమేధ అశ్వమేధాది యజ్ఞములు. | 0 - 8 - 0 |
| 11. | అదితి ద్వాదశాదిత్యులు మొదలగునవి. | 0 - 8 - 0 |
| 12. | యమ యమి మృత్యువు పితృదేవతలుకర్మ మొదలగునవి | 0 - 8 - 0 |
| 13. | సోమపానము అశ్వినులు రుద్రుడు పర్జన్యుడు. | 0 - 8 - 0 |
| 14. | ఋషులు సప్తర్షులు దధీచి, చ్యవనుడు మొదలగునవి. | 0 - 8 - 0 |
| 15. | ఋగ్వేదములోని. ముఖ్యప్రార్థనలు | 0 - 8 - 0 |
| 16. | మతవిధులేరీతిగఁ బ్రబలినది ... | 0 - 8 - 0 |

వలయువారు ఈక్రింది చిరునామాకు వ్రాయవలయు.

కె. శతృఘ్నరావు,

సివిల్ లైన్సు, బళ్లారి.